క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

ఇబ్రహీంపట్నం: కొజన్‌కొత్తూర్, ఎర్దండి, తిమ్మాపూర్, గొదూర్, మూలరాంపూర్, వేములకుర్తి ఫీడర్లలో చెట్ల కొమ్మలను శుక్రవారం కొడుతున్నందున ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సతీష్ గురువారం తెలిపారు.
కోరుట్లరూరల్: సంగెం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సంగెం టౌన్ ఫీడర్‌లో శుక్రవారం చెట్ల కొమ్మలు కొట్టే పనుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయముంటుందని విద్యుత్ రూరల్ ఏఈ భూక్యా శ్రీనివాస్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు సంగెం, ఇండస్ట్రియల్ ఏరియాలో ఉండదన్నారు.

ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని ప్రచారం

కోరుట్ల: పదోతరగతి ఉత్తీర్ణులైన పిల్లలను ప్రభుత్వ కళాశాలలో చేర్పించాలని కోరుతూ కోరుట్ల జూనియర్ కళాశాల అధ్యాపకులు ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వ కళాశాలలో నాణ్యమైన ఉచిత విద్యతోపాటు రాబోయే రోజుల్లో ఇంజనీరింగ్, టెక్నికల్ కోర్సుల్లో కూడా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్ లభిస్తుందని తల్లిదండ్రులకు వివరించారు. ప్రిన్సిపాల్ జిందం రాజేశ్, ఉపన్యాసకులు శ్రీనివాస్, వంశీకృష్ణ, శిరీష్, సాయికృష్ణ, రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఓటరు చైతన్యం

మల్యాల: పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మండలంలోని గ్రామాల్లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. మల్యాల మండలంలో 39,560 మంది ఓటర్లుండగా, 29,478 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. 74.51 శాతం పోలింగ్ నమోదయింది. గొర్రెగుండం గ్రామంలో 264 మంది ఓటర్లకు గాను 224 మంది ఓటేయగా.. మండలంలో అత్యధికంగా పోలింగ్ 86.24 శాతం నమోదయింది. మల్యాల మండల కేంద్రంలోని 302, 303, 304 పోలింగ్ స్టేషన్లలో అత్యల్పంగా 68.19, 66.98, 64.75 శాతం పోలింగ్ నమోదయింది.

చిరంజీవి ఫ్యాన్స్ అధ్యక్షుడిగా రాజేశ్

జగిత్యాల: చిరంజీవి ఫ్యాన్స్ పట్టణ అధ్యక్షుడిగా రాజేశ్‌ను నియమిస్తూ జిల్లా అధ్యక్షుడు ఎండీ పాషా ఉత్తర్వులు జారీ చేశారు. శ్యామ్‌గౌడ్, పులి నాగరాజుగౌడ్, వీరప్రసాద్ పాల్గొన్నారు.

ఎన్నికల విధుల భత్యం అందించాలి

కథలాపూర్: మండల కేంద్రంలో తహసీల్దార్ ముంతాజిబొద్దీన్‌కు ఆశ కార్యకర్తలు గురువారం వినతి పత్రం అందించారు. ఇతర నియోజకవర్గాల్లో ఆశ కార్యకర్తలకు రూ.600 చొప్పున అందించారని, కథలాపూర్ మండలంలోని ఆశ కార్యకర్తలకు రూ.300 చొప్పున చెల్లించడం దారుణమన్నారు. అందరికి ఒకేలా భత్యం చెల్లించాలని కోరారు. సంఘం ప్రతినిధులు మమత, దివ్య తదితరులున్నారు.

పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: జగిత్యాల పట్టణంలోని శంకులపల్లికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త మోర రజిత రోడ్డు ప్రమాదంలో గాయపడి జగిత్యాల ప్రభుత్వ చికిత్స చికిత్స పొందుతుండగా.. ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ పరామర్శించారు. యూత్ నాయకులు ప్రభాత్‌సింగ్‌ఠాకూర్, గిరి, రంగు మహేశ్, రిజ్వాన్, ఏనుగుల రాజు, నక్క గంగాధర్ ఉన్నారు.

ఈజీఎస్ పనుల్లో వేగం పెంచాలి

పెగడపల్లి: మండలంలో జరుగుతున్న ఉపాధిహామీ పనుల్లో వేగం పెంచాలని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్ సిబ్బందితో గురువారం సమీక్ష సమావేశం జరిగింది. గ్రామాల వారీగా జరుగుతున్న పనులు, హాజరవుతున్న కూలీల సంఖ్య, గిట్టుబాటవుతున్న వేతనం తదితర అంశాలు, ఉపాధిహామీ పనులపై పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో సమీక్షించారు. జాబ్‌కార్డున్న ప్రతి కూలీ పనులకు హాజరయ్యేలా చూడాలని, ఈజీఎస్‌లో నమోదు చేసుకున్న వారిలో కనీసం 75 శాతం మంది కూలీలు పనికి వచ్చేలా చూడాలని సూచించారు. ఎంపీవో మహేందర్, ఏపీవో అనిల్‌కుమార్, ఈసీ రమాపతి, టీఏలు రాజేశం, నాని, ఎఫ్ఏలు పాల్గొన్నారు.

తండ్రిపై తనయుడి దాడి

సారంగాపూర్: నాగునూర్‌లో తండ్రిపై దాడి చేసిన తనయుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. గ్రామానికి చెందిన లక్ష్మణ్ కూర రుచిగా లేదని తన భార్యను మందలించాడు. ప్లేట్‌ను బయట విసిరేయగా.. లక్ష్మణ్ పెద్ద కొడుకు గంగాధర్ వచ్చి కట్టెతో దాడి చేశాడు. లక్ష్మణ్ చేయి విరిగింది. లక్ష్మణ్ ఫిర్యాదు మేరకు గంగాధర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

ముందుకు కదలని అభివృద్ధి పనులు

- టెండర్లు పూర్తయినా ప్రారంభం కాని వైనం
- గత పనులకు బిల్లులు రాక కాంట్రాక్టర్ల అనాసక్తి


పూర్తిగా ధ్వంసమైన సిరివంచకోట రహదారి

బుగ్గారం: గ్రామాలు, పట్టణాల్లో వివిధ రకాల మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం రూ.కోట్లు కేటాయిస్తోంది. వీటితో ఆయా ప్రాంతాల్లో అవసరమైన వివిధ రకాల మౌలిక సదుపాయాలు కల్పించడంతోపాటు అనేక రకాల ప్రజావసరాలను కల్పిస్తారు. గ్రామాల్లో అవసరమైన రోడ్లు, డ్రైనేజీలు, వివిధ రకాల భవనాల నిర్మాణం, తాగునీరు వంటి సౌకర్యాలు కల్పిస్తారు. ఇందుకోసం నిధులను మంజూరు చేసి కాంట్రాక్టర్లకు పనులను అప్పగిస్తారు. ఆయా పనులు పూర్తయిన తర్వాత వాటికి ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుంది. కానీ గతంలో తాము చేసిన పలు రకాల పనులకు సరిగా బిల్లులందడం లేదని పలువురు కాంట్రాక్టర్లు నూతనంగా తమకు మంజూరైన పనులను ప్రారంభించడానికి ముందుకు రావడం లేదు. దీంతో గ్రామాలు, పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది.

రోడ్లు, భవనాల నిర్మాణమెప్పుడు?

ఉమ్మడి ధర్మపురి మండలంలో నూతనంగా పలు గ్రామాల మధ్య రహదారులు నిర్మించడానికి ప్రభుత్వం రూ.కోట్లాది నిధులను కేటాయించింది. వీటికి టెండర్లకు పూర్తయ్యాయి. అయినా కాంట్రాక్టర్లు పనులను ప్రారంభించడం లేదు. టెండర్ల గడువు ముగుస్తున్నా నూతన పనుల ప్రారంభంపై అనాసక్తి కనబరుస్తున్నారు. బుగ్గారం మండలం బీర్‌సాని గ్రామంలో 1.58 కిలోమీటర్ల పొడవుతో నూతన బీటీ రోడ్డు నిర్మించడానికి రూ.24లక్షలు మంజూరై టెండర్లు సైతం పూర్తయ్యాయి. బొంకూర్ నుంచి సిరికొండ వరకు 1.10 కిలోమీటర్ల పొడవుతో నూతన బీటీ రోడ్డును నిర్మించడానికి రూ.16.70లక్షలు మంజూరై టెండర్లు పూర్తయ్యాయి. ఇవేకాకుండా నూతనంగా ఏర్పడిన బుగ్గారం మండలంలో తహసీల్, ఎంపీడీవో కార్యాలయాలతోపాటు పలు రకాల ప్రభుత్వ భవనాలు నిర్మించడానికి రూ.2.5కోట్ల నిధులు మంజూరయ్యాయి. వీటికి సంబంధించిన అగ్రిమెంట్ గడువు ముగిసిపోయింది కానీ పనులు మాత్రం ప్రారంభం కాలేదు. భవనాలు నిర్మించే ప్రాంతంపై ప్రజలకు భిన్నాభిప్రాయాలుండడంతో పనులు ముందుకు సాగడం లేదని అధికారులంటున్నారు.

రహదారులు శిథిలం

పలు గ్రామాల్లో అంతర్గత రహదారులు, గ్రామాల మధ్యున్న రోడ్లు పూర్తిగా శిథిలమైపోతున్నాయి. బుగ్గారం మండల కేంద్రానికి వెళ్లే రహదారి పూర్తిగా గుంతలమయంగా మారి పలు ప్రమాదాలకు కారణమవుతోంది. గతంలో ఒకరు చనిపోగా.. పలువురు గాయాలపాలయ్యారు. బుగ్గారం మండల కేంద్రం నుంచి సిరివంచకోట గ్రామం మీదుగా వెల్గొండ లింకు రోడ్డు వరకు 2019లో నిర్మించిన బీటీ రోడ్డు పూర్తిగా చెడిపోయింది. పలుచోట్ల రోడ్డు ఆనవాళ్లు సైతం లేకుండా తయారయ్యింది. రూ.2.5కోట్లు వెచ్చించిన రోడ్డు స్వల్ప కాలంలోనే శిథిలమైపోయింది. పనుల్లో నాణ్యత లోపించడంతోపాటు ఈ రోడ్డుపై ఎక్కువగా కేజీవీల్స్‌తో కూడిన ట్రాక్టర్లు నడిపించడం ప్రధాన కారణమని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేజీవీల్స్ వాహనాలను నియంత్రించకుంటే మరిన్ని నూతన రహదారులు సైతం చెడిపోయే ప్రమాదముందని వాపోతున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి అభివృద్ధి పనులు త్వరగా ప్రారంభమయ్యేలా చూడాలని కోరుతున్నారు.

బిల్లులు రాక..



ధర్మపురి, బుగ్గారం మండలాల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టడానికి నిధులు మంజూరై టెండర్లు కూడా పూర్తయ్యాయి. గతంలో చేసిన పనులకు సకాలంలో బిల్లులు రావడం లేదని నూతన పనులను ప్రారంభించడానికి కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదు.
– లక్ష్మణ్‌రావు, డీఈఈ, జగిత్యాల

హామీలు అమలు చేయాలి


ధర్మపురిలో బీఆర్ఎస్ నాయకుల ధర్నా

ధర్మపురి: ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఏఎంసీ మాజీ చైర్మన్ అయ్యోరి రాజేశ్ డిమాండ్ చేశారు. గురువారం బీఆర్ఎస్ ఆధ్వర్యంలో స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద ధర్నా చేపట్టారు. ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు రూ.500 బోనస్ ఇవ్వడం లేదన్నారు. బీఆర్ఎస్ పాలనలో వరి ధాన్యం కొనుగోళ్లలో కోత విధిస్తున్నారని ఆరోపించారని, కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల వద్ద 4 కిలోలు కోత విధిస్తోందని అన్నారు. బీఆర్ఎస్ పార్టీ ప్రజల సమస్యలపై పోరాడుతుందన్నారు. నాయకులు మొగిలి శేఖర్, సంగి శేఖర్, అనంతుల లక్ష్మణ్, వైస్ ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, కౌన్సిలర్లు వేణుగోపాల్, అశోక్ తదితరులున్నారు.

ఆర్థిక సాయం అందజేత


జగిత్యాలటౌన్: ఆర్థిక సాయం అందజేస్తున్న సత్యసాయి సేవాసమితి ప్రతినిధులు

జగిత్యాలటౌన్: కిడ్నీ బాధితుడికి ఆస్పత్రి ఖర్చులు అందజేసి అండగా నిలిచారు సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు. బుడిగెజంగాలకాలనీకి చెందిన నూనె తిరుపతికి రెండు కిడ్నీలు పాడవగా.. కిడ్నీ మార్పిడి చేయాలని డాక్టర్లు సూచించారు. ప్రభుత్వం నుంచి ఆపరేషన్‌కు సంబంధించిన డబ్బులు మంజూరయ్యాయి. ఇతర ఖర్చుల కోసం ఇబ్బంది పడుతున్న తిరుపతి పరిస్థితిని తెలుసుకున్న సత్యసాయి సేవాసమితి కన్వీనర్ బట్టు రాజేందర్ స్పందించి సాయి భక్తుల నుంచి రూ.19,100 విరాళాలు సేకరించి గురువారం బాధితుడికి అందజేశారు.

బుగ్గారం: యశ్వంతరావుపేట గ్రామంలో అనారోగ్యానికి గురై ఇబ్బందులు పడుతున్న ఇరువురు వ్యక్తులకు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేముల సుభాష్ ఆర్థిక సాయం అందించారు. వారి ఇళ్లకు వెళ్లి పరామర్శించారు. రూ.10వేలు ఆర్థిక సాయం చేశారు. ఉరిమెట్ల సంతోష్, షేక్ సమీద్, బండారి మహేశ్, సయ్యద్ అమీర, మంచాల లక్ష్మీరాజం తదితరులున్నారు.

మల్లాపూర్: మొగిలిపేటలో గురువారం నిరుపేద బాధిత కుటుంబానికి మొగిలిపేట సేవావారధి మిత్ర బృందం రూ.5వేల ఆర్థిక సాయమందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామానికి చెందిన గడ్డం శ్రీనివాస్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడన్నారు. శ్రీనుది నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థిక సాయం చేశామని చెప్పారు.

మామిడి తోటలో మంటలు

ధర్మపురి: చెత్తకుప్ప కాల్చేందుకు అంటించిన మంట ప్రమాదవశాత్తు టేకుచెట్లతోపాటు మామిడి తోట, పైపులకు అంటుకుని పూర్తిగా కాలిపోయాయి. ఈ ఘటన మండలంలోని రామయ్యపల్లెలో జరిగింది. మామిడి, టేకు చెట్లు ఉన్న ప్రాంతంలో ఓ మహిళ చెత్తకు నిప్పంటించింది. ఆ నిప్పు ఎగిసిపడి పక్కనే ఉన్న మామిడితోటతోపాటు టేకు చెట్లకు అంటుకున్నాయి. ఫైరింజన్ సిబ్బందికి సమాచారం అందించగా.. సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. సుమారు రూ.లక్ష వరకు ఆస్తి నష్టం వాటిల్లినట్లు రైస్‌మిల్ యజమాని రంగ శంకరయ్య తెలిపారు. కార్యక్రమంలో లీడింగ్ ఫైర్‌మెన్ ప్రవీణ్‌రావు, సిబ్బంది రాకేష్, శంకరయ్య, వైరుత్ ఖాన్ తదితరులున్నారు.

ఘనంగా పెద్దమ్మ తల్లి బోనాలు


పెద్దమ్మ తల్లి దేవాలయంలో భక్తులు

జగిత్యాలరూరల్: మోరపల్లి గ్రామంలో గురువారం ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో పెద్దమ్మ తల్లికి బోనాల పండుగ నిర్వహించారు. పెద్దఎత్తున మహిళలు నెత్తిన బోనాలు ఎత్తుకొని డప్పుల చప్పుళ్లతో ప్రధాన వీధుల గుండా ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. సింగిల్‌విండో చైర్మన్ పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి, ముదిరాజ్ సంఘం నాయకులు జంగిలి భూమయ్య, రాంమోహన్, గంగాధర్, లింగన్న, గణేశ్, శేఖర్, తిరుపతిగౌడ్ పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



జగిత్యాలరూరల్: గుల్లపేట రెడ్డి జన సంక్షేమ సంఘం కార్యవర్గాన్ని గురువారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కొంగరి చంద్రారెడ్డి, ఉపాధ్యక్షుడిగా పడిగెల రాజిరెడ్డి, కోశాధికారిగా దమ్మ సుదర్శన్‌రెడ్డి, సభ్యులుగా దమ్మ గంగారెడ్డి, మద్దుల మల్లారెడ్డి, నాగిరెడ్డి కృష్ణారెడ్డి, గుర్రాల గంగారెడ్డి, కొంగరి కృష్ణారెడ్డి, కొంగరి గంగారెడ్డి, బోడుగం విజయ్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎంపీటీసీ దమ్మ సురేందర్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచులు దమ్మ పెద్దగంగారెడ్డి, గుర్రాల తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

ఖమ్మం దొంగతో జాగ్రత్త..

బుగ్గారం: ఖమ్మం జిల్లాకు చెందిన ఓ దొంగ ధర్మపురి, బుగ్గారం, వెల్గటూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో దొంగతనాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్నాడని, అతడితో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బుగ్గారం ఎస్సై శ్రీధర్‌రెడ్డి సూచించారు. ఖమ్మం జిల్లా మధిరకు చెందిన కంభంపాటి ఏసోబు అనే వ్యక్తిగా అతన్ని గుర్తించినట్లు తెలిపారు. వేసవి కాలంలో పలువురు ఆరుబయట నిద్రిస్తుండడంతో.. ఇళ్లలోకి చొరబడి దొంగతనాలకు పాల్పడుతున్నాడని చెప్పారు. గ్రామంలోకి ఎవరైనా అపరిచిత వ్యక్తులు వస్తే వెంటనే పోలీసులకు సమాచారమివ్వాలని కోరారు.

హైపర్ టెన్షన్ సైలెంట్ కిల్లర్

జగిత్యాల: హైపర్ టెన్షన్ సైలెంట్ కిల్లర్ అని, తరుచూ పరీక్షలు చేయించుకోవాలని అసంక్రమిత వ్యాధుల నియంత్రణాధికారి నమియొద్దీన్ అన్నారు. ఏటా మే 17న రక్తపోటుకు సంబంధించి వరల్డ్ హైపర్‌టెన్షన్ జరుపుకుంటామన్నారు. తరుచుగా తలనొప్పి వస్తే హైపర్‌టెన్షన్‌కు ముందస్తు హెచ్చరిక అన్నారు. తల రెండువైపులా వణుకుతూ ఉంటుందన్నారు. ఎక్కువకాలం అధిక రక్తపోటు ఉంటే కళ్లలోని రక్తనాళాలను దెబ్బతీస్తుందన్నారు. శ్వాస ఆడకపోవడం, గుండెనొప్పి వచ్చే అవకాశాలున్నాయన్నారు. ఒత్తిడి లేకుండా ప్రశాంతమైన జీవితం గడపాలన్నారు.

అప్రమత్తతతోనే వ్యాధుల నివారణ


గొల్లపల్లి: ర్యాలీ ప్రారంభిస్తున్న మండల వైద్యాధికారి నరేశ్


ఒడ్డెలింగాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బంది

గొల్లపల్లి: అవగాహన, అప్రమత్తతతోనే అంటువ్యాధుల నివారణ సాధ్యమని మండల వైద్యాధికారి డాక్టర్ నరేశ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన జాతీయ డెంగీ నివారణ అవగాహన ర్యాలీని ప్రారంభించారు. సీహెచ్‌వో గట్టు శ్రీధర్, సూపర్‌వైజర్లు రమేశ్, నరేందర్, శారద, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
రాయికల్: దోమల నిర్మూలనతోనే డెంగీ నివారణ సాధ్యమని ఒడ్డెలింగాపూర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కస్తూరి సతీశ్ అన్నారు. డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. సీహెచ్‌వో ప్రమీల, సూపర్‌వైజర్ శ్రీధర్, హెల్త్ అసిస్టెంట్ భూమయ్య, నర్సింగ్ ఆఫీసర్లు స్వాతి, మౌనిక, ఫార్మసిస్ట్ దీపిక, ల్యాబ్ టెక్నీషియన్ రాజమణి, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
మల్యాల: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. మండల వైద్యురాలు మౌనిక దోమల నివారణపై అవగాహన కల్పించారు. సీహెచ్‌వో పి.లక్ష్మి, డీపీఎంవో దేవీసింగ్, పీహెచ్ఎన్ నాగలక్ష్మి, సూపర్‌వైజర్ సునంద, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
మేడిపల్లి: ఆరోగ్యం బాగుంటేనే దేశం బాగుంటుందని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు డా.ప్రవీణ్‌చంద్ర అన్నారు. అంబేడ్కర్ విగ్రహం వద్ద డెంగీపై అవగాహన కల్పించారు. వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.
ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి హరీష్‌కుమార్ మాట్లాడారు. సీహెచ్‌వో విజయభాస్కర్, పీహెచ్ఎల్ హేమలత, ఎంపీహెచ్ఏవో కృపాకర్, ఫార్మసిస్ట్ ఉదయ్‌ప్రసాద్, నర్సింగ్, అధికారులు రాజేందర్, మౌనిక, ల్యాబ్ టెక్నీషియన్ నరేష్, హెల్త్ అసిస్టెంట్ లక్ష్మణ్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
కథలాపూర్: కథలాపూర్‌లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి సింధూజ, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
మల్లాపూర్: డెంగీ నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పీహెచ్‌సీ మెడికల్ అధికారి డాక్టర్ వాహిని అన్నారు. మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి వైద్య సిబ్బందితో కలిసి చేపటిన అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. పీహెచ్‌సీ సీహెచ్‌వో రామ్మోహన్, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీనివాస్, ఇందిర, ల్యాబ్ టెక్నీషియన్ ఉమాదేవి, హెల్త్ అసిస్టెంట్లు శ్రీనివాస్, రవీందర్, స్టాఫ్‌నర్స్, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
మెట్‌పల్లి: మెట్‌పల్లిలో వైద్య సిబ్బంది, మున్సిపల్ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి అంజిత్‌రెడ్డి, మెడికల్ ఆఫీసర్ వాణి, సబ్ యూనిట్ ఆఫీసర్ విలాయత్‌బేగ్, ఇన్‌చార్జి శానిటరీ ఇన్స్‌పెక్టర్ రత్నాకర్, హెల్త్ సూపర్‌వైజర్ అచ్యుత్‌రావు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.
పెగడపల్లి: డెంగీ ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు పాటించాలని ప్రాథమిక వైద్యాధికారి నరేశ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్లు శ్రీనివాస్, అనిల్‌కుమార్, జయశీల, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
సారంగాపూర్: మండల కేంద్రంలో మండల ఆరోగ్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎం, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.
ధర్మపురి: డెంగీ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ వైద్యాధికారిణి అవంతి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి కోరారు. పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో మాట్లాడారు. హెచ్ఈవో సతీష్‌కుమార్, ఎంపీహెచ్‌వో వెంకటేశ్, ఆస్పత్రి సిబ్బంది భూంలాల్, మహేందర్, శోభన్‌బాబు, మున్సిపల్ సిబ్బంది గంగాధర్ తదితరులున్నారు.
వెల్గటూర్: వెల్గటూర్, అంబరిపేట పీహెచ్‌సీల పరిధిలో ర్యాలీ నిర్వహించారు. డెంగీపై ప్రజలకు అవగాహన కల్పించామని పీహెచ్‌సీ వైద్యాధికారులు డా.శ్రవణ్‌కుమార్, డా.లవకుమార్ తెలిపారు. జిల్లా ఎన్సీడీసీ ప్రోగ్రాం అధికారి డా.సమయుద్దీన్ ఆధ్వర్యంలో అంబరిపేట పీహెచ్‌సీలో హైపర్ టెన్షన్, డయాబెటిస్, క్యాన్సర్ వంటి అసంక్రమిత వ్యాధులపై వెల్గటూర్, అంబరిపేట పీహెచ్‌సీ సూపర్‌వైజర్లు, సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తదితరులున్నారు.

గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సులు

- వేసవి సెలవులా అంటూ ప్రశ్నిస్తున్న జనం
- 'మహాలక్ష్మి'కి దూరమయ్యామంటున్న వైనం


కథలాపూర్ బస్టాండ్ వద్ద వాహనాల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

కథలాపూర్: సాధారణంగా వేసవి సెలవులు కళాశాలలు, పాఠశాలలకు ఉండటం సహజం. కానీ ఆర్టీసీ బస్సులకు సెలవు ఉంటే అది విడ్డూరమని ప్రజలంటున్నారు. ప్రజావసరాలను విస్మరించి ఆదాయం రావడం లేదనే సాకుతో వేసవి సెలవుల రోజుల్లో బస్సులు నడిపించకపోవడంతో ఇబ్బందులు పడుతున్న వైనం మండలంలోని పలు గ్రామాల ప్రజలది. మహాలక్ష్మి పథకం ద్వారా బస్సుల్లో ఉచిత ప్రయాణం ప్రభుత్వం అమలు చేస్తుండగా.. తమకు బస్సు సౌకర్యం లేక వినియోగించుకోలేకపోతున్నామని మహిళలంటున్నారు.


8 రూట్లలో బస్సులు

ఆర్టీసీ కోరుట్ల డిపోకు చెందిన బస్సులు కథలాపూర్ మండల కేంద్రం మీదుగా సుమారు 8 రూట్లలో నడుస్తున్నాయి. కథలాపూర్ మండల ప్రజలు వివిధ అవసరాలకు సమీపంలో ఉన్న కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాలకు వెళ్లి వస్తుంటారు. కోరుట్ల–వేములవాడ రూట్‌లో కథలాపూర్ మండల కేంద్రం ఉండటంతో ప్రతి బస్సు కథలాపూర్ మీదుగా వెళ్తుంది. ఆర్టీసీ బస్సులను ప్రజలు, వ్యాపారులు, ఉద్యోగులు, విద్యార్థులు వినియోగించుకుంటున్నారు. కోరుట్ల–వేములవాడ రూట్‌లో ప్రతిరోజు యధావిధిగా బస్సులు నడిపిస్తున్న అధికారులు.. గ్రామాలకు వెళ్లే బస్సులను విద్యాసంస్థలకు వేసవి సెలవుల ప్రారంభం నుంచి రద్దు చేశారు. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వివిధ గ్రామాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడుతున్నారు.

ఇబ్బంది పడుతున్న గ్రామాలివే..

కథలాపూర్ మండలం దూలూర్, చింతకుంట, రాజారాంతండా, భూషణరావుపేట, పెగ్గెర్ల, ఊట్‌పెల్లి, కోనాపూర్ గ్రామాలకు వేసవి సెలవులు ప్రారంభం నుంచి బస్సులను రద్దు చేశారని ప్రజలు పేర్కొన్నారు. ఇదే అదునుగా భావించి ప్రైవేట్ ఆటోలు, జీపులు చార్జీలు ఇష్టమొచ్చినట్లు వసూలు చేస్తున్నారని ప్రయాణికులు వాపోతున్నారు. వివిధ అవసరాలకు వేరే గ్రామాలకు వెళ్తే రాత్రివేళల్లో ఇంటికి చేరడానికి అష్టకష్టాలు పడాల్సిందేనని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూరగాయాలు, పాల వ్యాపారులు నెల రోజుల నుంచి ఎటూ వెళ్లలేక ఇంటి వద్దే ఉండిపోతున్నారు. బస్సుల సౌకర్యం గురించి ఆయా గ్రామస్తులు ప్రజాప్రతినిధులకు విన్నవిస్తున్నా స్పందన కరువైందన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ చూపి యధావిధిగా బస్సు సౌకర్యం ఉండేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.

బస్సులు నడిపించాలి



గ్రామాలకు సమయానుసారం బస్సులు నడపాలి. ఆయా గ్రామాలకు ఉదయం పూట బస్సులు రాకపోవడంతో బంధువుల ఊర్లకు, పట్టణాలకు వెళ్లాలంటే ప్రజలు ఇబ్బందులు పడుతుండ్రు. – ఎంబేరి వాల్మీకి, చింతకుంట

రైతులకు నష్టం



మహాలక్ష్మి పథకంలో మహిళలకు ఉచిత ప్రయాణమంటే సంబరపడ్డాం. తాము అష్టకష్టాలు పడి పండించిన కూరగాయలు, పాలు మండల కేంద్రానికి, పట్టణ ప్రాంతాలకు వెళ్లి విక్రయించలేకపోతున్నాం. – రాధ, రైతు, దూలూర్

జూన్ 1 నుంచి బస్సు సౌకర్యం కల్పిస్తాం

కథలాపూర్ మండలంలోని పలు గ్రామాలకు జూన్ 1 నుంచి యధావిధిగా బస్సు సౌకర్యం కల్పిస్తాం. పాఠశాలలు, కళాశాలలకు తరగతులు పూర్తయ్యేవరకు గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాం. ఎన్నికల వల్ల వివిధ శాఖల అవసరాల నిమిత్తం బస్సులను వినియోగించుకోవడంతో గ్రామాలకు ట్రిప్పులను రద్దు చేశాం.

బేస్‌బాల్ పోటీలో హరికృష్ణకు పతకం



బుగ్గారం: బుగ్గారం మండలం సిరికొండ గ్రామానికి చెందిన పంచిత హరికృష్ణ అంతర్జాతీయ బేస్‌బాల్ పోటీల్లో పతకం సాధించాడు. జగిత్యాలలోని ఓ ప్రైవేటు పాఠశాలలో పదో తరగతి చదువుతున్న హరికృష్ణ నేపాల్‌లో జరుగుతున్న ఇంటర్నేషనల్ యూత్ గేమ్స్ చాంపియన్ షిప్–2024లో భారత్ తరపున పాల్గొన్నాడు. గురువారం జరిగిన ఫైనల్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి బంగారు పతకాన్ని సాధించాడు. ఆయనను స్థానికులు అభినందించారు.

ప్రహరీ వివాదంలో ఇద్దరి రిమాండ్

గొల్లపల్లి: మండలంలోని గుంజపడుగులో ప్రహరీ విషయమై తలెత్తిన వివాదంలో ఇద్దరి రిమాండ్‌కు పంపినట్లు పోలీసులు తెలిపారు. అకారణంగా గొడవ పెట్టుకున్నారని పస్తం శారద ఫిర్యాదు మేరకు క్లోం తిరుపతి, క్లోం తిరుమలేశ్‌పై కేసు నమోదు చేశారు. వారిని కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ బియ్యం తరలిస్తున్న వ్యక్తిపై కేసు

సారంగాపూర్: రేషన్ బియ్యాన్ని తరలిస్తున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు బీర్‌పూర్ ఎస్సై గౌతంపవార్ తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలం ఉమ్రి గ్రామానికి చెందిన రాజేశ్ మండలంలోని కొల్వాయిలో మూడు క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి తరలిస్తుండగా పట్టుకుని కేసు నమోదు చేశామని పేర్కొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

ఇబ్రహీంపట్నం: మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో చేరేందుకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రత్యేకాధికారి రజిత గురువారం తెలిపారు. 6వతరగతిలో 40, ఇంటర్ మొదటి సంవత్సరం ఎంపీహెచ్‌డబ్ల్యూలో 40, సీఈసీలో 40 సీట్లు ఖాళీగా ఉన్నట్లు చెప్పారు.